క్లుప్తంగా

ఘనంగా ప్రగడ కోటయ్య జయంతి



పొన్నూరు: చేనేత బాంధవుడు మాజీ ఎంపీ ప్రగడ కోటయ్య జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీబీసీ రోడ్డు వీవర్స్ కాలనీలోని ప్రగడ కోటయ్య విగ్రహానికి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

31న డిప్లమా కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

పొన్నూరు: పొన్నూరు ఇటికంపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ మెకానికల్ చదవాలనుకునే విద్యార్థులకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దోమకాటుతోనే జ్వరాలు

పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి



ప్రత్తిపాడు: దోమకాటుతోనే మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రబలుతాయని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. మండల పరిధిలోని వంగిపురం, తిక్కిరెడ్డిపాలెం, పాత మల్లాయపాలెం, ప్రత్తిపాడు గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, సీహెచ్‌వో స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం రక్షిత మంచి నీటి చెరువులు, మంచినీటి బావుల్లో గంబూషియా చేపలను వదిలారు. ఇవి చెరువులోని చేపలు, దోమ లార్వాలను తినేస్తాయన్నారు. దీని వలన దోమల ఉత్పత్తి తగ్గుముఖం పడుతుందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: నేడు పెదకాకాని మండలంలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ పీహెచ్ ఖాన్ తెలిపారు. మండలంలోని తక్కెళ్ళపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం, దేవరాయభట్లపాలెం, గోళ్ళమూడి, రామచంద్రపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కొత్తలైన్ల ఏర్పాటులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని: ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని వడ్డెర కాలనీకి చెందిన వేముల చిట్టిబాబుకు వినుకొండ ప్రాంతంలోని వేల్పూరు గ్రామానికి చెందిన శిరీషతో రెండేళ్ల క్రితం వివాహమైంది. చిట్టిబాబు ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో వివాదాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో శుక్రవారం చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు గ్రామంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే చిట్టిబాబు (24) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య శిరీష, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలోవృద్ధుడు మృతి



ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన బండారు నాగేశ్వరరావు (61) గత కొంతకాలంగా డయాలసిస్‌తో బాధపడుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం గుంటూరులో డయాలసిస్ చేయించేందుకు తండ్రి నాగేశ్వరరావును బైక్‌పై ఎక్కించుకుని కుమారుడు వినాయక్ గుంటూరులోని ఆస్పత్రికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇద్దరూ గుంటూరు నుంచి తుమ్మలపాలెం వైపు వెళుతుండగా.. చిలకలూరిపేట వైపు అతివేగంతో వెళుతున్న కారు 16వ నంబరు జాతీయ రహదారిపై నడింపాలెం కాటూరి ఆస్పత్రి సమీపంలో బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుల గుట్టు వీడేనా...!?

- ప్రత్తిపాడు సబ్‌సెంటరు–2 ఆవరణలో కాల్చిన మాత్రల అవశేషాలు
- పట్టించుకోని అధికారులు

ప్రత్తిపాడు: ప్రజలకు సరఫరా చెయ్యాల్సిన మందులు బూడిదగా మారి దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఆరోగ్య ఉపకేంద్రం –2 సమీపంలో పిచ్చి చెట్ల మధ్య వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు ఉచితంగా సరఫరా చేసిన మందులు కొన్ని కాలినవి కనిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా మందులను తగులబెట్టేసినప్పటికీ అందుకు సంబంధించిన మాత్రల అవశేషాలను అలాగే వదిలెయ్యడంతో విషయం వెలుగు చూసింది. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఉచితంగా సప్లై చేసిన మందులను ఇలా మూడో కంటికి తెలియకుండా మసి చేసి ఉంటారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అయితే ఎంత మొత్తంలో మందులను తగులబెట్టారు.. ఎవరు తగులబెట్టారు? ప్రజలకు పంపిణీ చేయాల్సినవా.. లేక కాలం చెల్లినవా.. అనే వివరాలు అధికారులు లోతుగా విచారణ చేస్తే తప్ప తెలియని పరిస్థితి. ఆరోగ్య ఉపకేంద్రం పక్కనే కాలిన మాత్రలు పడి ఉండటంతో ఇవి సబ్ సెంటరు మాత్రలేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



సచివాలయం పక్కన పిచ్చిచెట్ల మధ్య కాల్చిన జేఏఎస్ సామగ్రి



సగం కాలిపోయిన మాత్రలు

మందులు ఇచ్చినట్టు నమోదు

గతంలో ప్రజలకు ఏఎన్ఎంల ద్వారా మందుల సరఫరా జరిగేది. అయితే గత ప్రభుత్వం ఎంఎల్ హెచ్‌పీలను నియమించి సబ్ సెంటర్ బాధ్యతలను వారికి అప్పగించింది. మందుల పంపిణీ బాధ్యత కూడా వారిదే. వీరు ప్రతి రోజు తమ పరిధిలో వారి వద్దకు వచ్చే రోగులకు మాత్రలు అందించాలి. లేకుంటే టెలీ కాల్స్ చేసి వైద్యుల సూచనల మేరకు మందులను అందించాల్సి ఉంది. కానీ ఇందులోనే పెద్ద మాయ ఉంది. వాస్తవానికి సబ్ సెంటరుకు వచ్చే వారిలో అత్యధికులు బీపీ, షుగర్‌లతో బాధపడేవారే. వారికి ఎంఎల్‌హెచ్‌పీలే మందులు ఇస్తుంటారు. కాగా కొందరు మాత్రం సబ్ సెంటర్‌లో కూర్చుని కాల్స్ చెయ్యకుండానే చేసినట్లుగా చూపి, వారికి మందులు అందించినట్లు రిజిస్టర్లలో నమోదు చేసుకుంటారు. ఇది క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకూ అందరికీ తెలిసిన జగమెరిగిన సత్యం. కానీ ఎవ్వరూ నోరు మెదపని పరిస్థితి ఉంది. మరి రోగులకు ఇచ్చినట్లు వారి పేరుతో చూపిస్తున్న మాత్రలు ఏమవుతున్నాయి అన్నది మాత్రం మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోతుంది. దీనిపై సమగ్ర విచారణ జరిగితే గానీ మందుల గుట్టు ముడి వీడదు.

అలాంటిదేమీ లేదని చెప్తున్నారు..

మందులు తగులబెట్టడంపై సబ్ సెంటర్ సిబ్బందిని విచారించాను. మందులు తగులబెట్టలేదని చెప్పారు. కాల్చింది జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులు, ఫోల్డర్లు అని చెబుతున్నారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తాం.

– స్రవంతి, వైద్యాధికారి, కో లోకేటెడ్ పీహెచ్‌సీ, ప్రత్తిపాడు



ప్రత్తిపాడు–2 సబ్ సెంటరు పక్కన పడి ఉన్న కాలిన మాత్రల అట్టలు

బడిలో బోర్ కొట్టిందేమో..!

ప్రత్తిపాడు: బడిలో హాజరు వేసుకుని ఆన్ డ్యూటీలో ఉన్న ఇద్దరు ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు పంగనామం పెట్టి షికార్లు చేస్తున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ప్రత్తిపాడు మండల పరిధిలోని వంగిపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎప్పటిలానే శుక్రవారం ఉదయం కూడా పాఠశాలకు వెళ్లారు. కొద్దిసేపు అక్కడ ఉండి.. హాజరు కూడా వేసుకున్నారు. రొటీన్‌గా పిల్లలకు బడిలో పాఠాలు చెప్పడం బోర్ కొట్టిందో ఏమో.. తెలియదు గానీ పాఠశాలల నుంచి మండల కేంద్రం ప్రత్తిపాడుకు వచ్చారు. సుమారు 11 గంటల నుండి 11.40 వరకు ప్రధాన రహదారిలో ఉన్న టీడీపీ కార్యాలయం భవనం కింద, మండలానికి చెందిన కొందరు కీలక టీడీపీ నేతలతో సరదాగా ముచ్చట్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తూ కనిపించారు. ఆ తర్వాత ఒక హెచ్ఎం పాఠశాలకు వెళ్లిపోగా, మరో హెచ్ఎం మాత్రం మధ్యాహ్నం వరకు ఆయా నాయకులతోనే కాలక్షేపం చేస్తూ ఉండిపోయారు. ప్రభుత్వం వేలకు వేలు జీతాలు ఇచ్చేది పిల్లలకు పాఠాలు చెప్పడానికో, లేక టీడీపీ నేతలతో ముచ్చట్లు చెప్పడానికో తెలియని పరిస్థితి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా పాఠశాల పని సమయంలో హాజరు వేసుకుని, బయట గ్రామాల్లో చక్కర్లు కొట్టడం స్థానికంగా చర్చనీయాంశమయ్యింది. ఇదే విషయాన్ని 'సాక్షి' జిల్లా విద్యాశాఖాధికారి శైలజ దృష్టికి తీసుకువెళ్లగా విచారిస్తామని చెప్పారు.



టీడీపీ నేతలతో ముచ్చటిస్తున్న ప్రధానోపాధ్యాయులు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

'ప్రమాదంతో ఆటలు'పై డీఈవో ఆరా

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: విద్యార్థులు బడికి వచ్చిన దగ్గర నుంచి తిరిగి సాయంత్రం వెళ్లే వరకు ఉపాధ్యాయులు వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని యనమదల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాఠశాల ముగిశాక ఇంటికి వెళ్లకుండా బడి భవనంపైకి ఎక్కి ప్రమాదకర రీతిలో ఆటలు ఆడుతున్నారంటూ ఈ నెల 26వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'ప్రమాదంతో ఆటలు' కథనంపై డీఈవో శైలజ స్పందించారు. ఏం జరిగిందని ఆరా తీసి.. వెంటనే పాఠశాలకు వెళ్లి విచారించి నివేదిక అందజేయాలని ఎంఈవో రమాదేవిని ఆదేశించారు. దీంతో ఎంఈవోలు రమాదేవి, లీలారాణిలు పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులనూ ప్రశ్నించారు. పొరబాటున ప్రమాదం జరిగితే ఎదురయ్యే అనర్థాలను విద్యార్థులకు సున్నితంగా వివరించారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే వరకు ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని.. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతోనూ మాట్లాడారు. తదనంతరం ఘటనపై పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రకళ నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకుని జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి పంపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రమాదేవి

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎంపీడీవో దుర్గాప్రసాద్

ప్రత్తిపాడు: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో కె.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా వార్డు సభ్యులు, సర్పంచ్‌లకు నీరు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో దుర్గాప్రసాద్ శిక్షణ కరదీపికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం ఆరోగ్యంగా ఉండాలంటే సురక్షిత తాగునీరు, స్వచ్ఛమైన పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరారు. అనంతరం వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సురేష్ జల్‌జీవన్, స్వచ్ఛభారత్ మిషన్‌లు, జల సంఘాలు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, గొట్టిపాడు సర్పంచ్ మరియరాణి, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, గొట్టిపాడు, మేడావారిపాలెం, గ్రామాల వార్డు సభ్యులు, యానిమేటర్లు, వాటర్ ఎయిడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కరదీపికలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో దుర్గాప్రసాద్

యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలి

ప్రత్తిపాడు: నేటి తరం యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలని అసెంట్ ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ చీఫ్ ఫెసిలిటేటర్ సయ్యద్ రఫీ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 26 నుంచి 29 వరకు కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సీఎస్‌ఈ విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, లీడర్‌షిప్, ఆటిట్యూడ్, గోల్ సెట్టింగ్... వంటి అంశాలపై మోటివేషన్ తరగతులు జరగనున్నాయి. తొలిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంట్ ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ చీఫ్ ఫెసిలిటేటర్ సయ్యద్ రఫీ హాజరయ్యారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లు, సమస్యలను సమర్థవంతంగా దాటుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. అడ్డంకులను సోపానాలుగా మలచుకుంటే విజయ శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని సాధించడానికి కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్య ఉత్తమ ఫలితాలు అందిస్తుందని సెక్రటరీ కె.శేఖర్ అన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రమేష్, డాక్టర్ సీహెచ్ అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ రఫీ

హర్ ఘర్ జల్‌తో ప్రతి ఇంటికీ కుళాయి

ప్రత్తిపాడు: హర్‌ఘర్ జల్ పథకం కింద కుళాయిలు లేని ప్రతి ఇంటికి నీటి కుళాయి ఇవ్వడం జరుగుతుందని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా అన్నారు. మండల పరిధిలోని నడింపాలెం, ప్రత్తిపాడు గ్రామాల్లో శుక్రవారం హర్ ఘర్ జల్, ఓడీఎఫ్ ప్లస్‌లపై గ్రామ సభలను నిర్వహించారు. నడింపాలెంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాలెపు కుమారి అధ్యక్షతన జరిగిన సభలో తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖాజా మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటుతో పాటు సురక్షిత తాగు నీరు అందించడమే హర్ ఘర్ జల్ ఉద్దేశమన్నారు. ఓడీఎఫ్ గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా ఆదాయం చేకూరేలా జీవనోపాధులను మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయండి

ప్రత్తిపాడు: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ఇతర పాఠశాలల నుంచి సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కె.వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్ రెడ్డిలు కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఎంఈవోలు రమాదేవి, లీలారాణిలను కలిసి వినతిపత్రం అందజేశారు. పాతమల్లాయపాలెం హైస్కూల్‌కు పీఎస్ టీచర్‌ను, వంగిపురం హైస్కూల్‌కు ఎస్ఎస్ టీచర్‌ను, తుమ్మలపాలెం యూపీ పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విన్నవించారు. అదేవిధంగా ఎస్ఆర్‌లో ఎంట్రీలను అప్‌డేట్ చేయాలని, 2022లో చేసిన ఎస్ఎల్ బిల్లుల వివరాలను అందజేయడంతో పాటు టీడీఎస్ చేసే సమయంలో జరిగిన పొరబాట్లను సరిచేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఎండీ షకీలా బేగం, కె.మౌలాలి, జి.రవికుమార్, ఎస్.అంకమ్మరావు, టి.వెంకటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కె.ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.



ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆర్టీసీ బస్సు లారీ ఢీ.. ప్రయాణికులకు గాయాలు

పొన్నూరు: ఆర్టీసీ బస్సును ఇసుక లారీ ఢీకొని ప్రయాణికులకు గాయాలైన ఘటన మండలంలోని చింతలపూడి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల నుంచి గుంటూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో కిటికీల వద్ద కూర్చున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనంలో పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

ఎంఈవో కె.ఎఫ్.కెనడీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో కెనడీ

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజు సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి రోజు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి.నాగ్య శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తొలుత రైల్వే స్టేషన్‌లోని నూతన ప్లాట్‌ఫాంను పరిశీలించారు. ప్రాంగణంలోని పిట్‌లైన్, రన్నింగ్‌రూమ్, లాబీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అభివృద్ధి పనులును పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని ప్రయాణికులకు అందుబాటులోఉన్న వివిధ సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికుల కల్పించే సౌకర్యాలలో ఎలాంటి లోపం, నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గుంటూరు యార్డు పునరుద్ధరణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట డివిజన్ సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్ ఉన్నారు.

అమరావతి బౌద్ధ స్థూపాన్ని సందర్శించిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిలోని చారిత్రక బౌద్ధ స్థూపంతో పాటు అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని శుక్రవారం గుంటూరులోని హిందూ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఇన్‌టాక్ సంస్థ ఆధ్వర్యంలో అమరావతి మ్యూజియంతో పాటు పంచారామ క్షేత్రాల్లో ఒకటైన అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించిన విద్యార్థులు అక్కడి చారిత్రక విశేషాలు, పురాతన చరిత్రను తెలుసుకున్నారు. ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ ఏ రవి శ్రీనివాస్, సీతారమేష్, అడపా వేణు, విజయ్‌కుమార్, పురావస్తు పరిశోధకుడు శ్రీనాథ్‌రెడ్డి, హిందూ కళాశాల చరిత్ర శాఖ అధ్యాపకుడు చెన్నయ్య, వేంకటేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా వీడ్కోలు వేడుకలు

గుంటూరు రూరల్: విలువైన కళాశాల జీవితం విద్యార్థులకు మధుర జ్ఞాపకాలను నింపేలా ఉండాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో చివరి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు జూనియర్స్ వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తమ లక్ష్య సాధన దిశగా కృషి చేసి ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. అధ్యాపకులను వివిధ విభాగాల విద్యార్థులు సన్మానించారు. విద్యార్థులు వారి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె మద్దినేనిలు అన్నారు. కుటుంబ గౌరవం పెంచేలా ముందుకు సాగాలని కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

మండలంలోని చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 9వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జె.మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె మద్దినేనిలు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ కార్యక్రమానికి అతిథులుగా ఇస్రో డైరెక్టర్ బీఎన్ రామకృష్ణ, ఏఎన్‌యూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర్‌లు పాల్గొంటారని తెలిపారు. 2020–24 సంవత్సరం 36వ బ్యాచ్‌లో పలు ఇంజనీరింగ్ విభాగాల్లో 1066 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టాలను, 161 మంది పీజీ పట్టాలను పొందుతున్నారని తెలిపారు. విద్యార్థులకు బంగారు పతకాలను అందించటం జరుగుతుందని కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, తదితరులున్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

నర్సింగ్ కళాశాలలో క్యాపింగ్ సెర్మనీ



విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గ్రామంలోని సెయింట్ ఆన్స్ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం పునీత అన్నమ్మ పండుగ సందర్భంగా దివ్యబలిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ రాయన్న గోవింద్, ఫాదర్లు ఆరోగ్యస్వామి, ఇన్నారెడ్డి, జోసఫ్, ఇన్నారెడ్డిలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు క్యాపింగ్ సెర్మనీ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లీనా అందజేశారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ దీపాలను అందించి నర్సింగ్ వృత్తి ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ నిర్వహించిన బీఎస్సీ నర్సింగ్ పరీక్ష ఉత్తీర్ణతలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు మెడల్స్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీకాం ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ గురువారం ప్రకటించిన బీకాం ద్వితీయ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జనరల్, కంప్యూటర్స్ కోర్సుల్లో అత్యధిక మార్కులతో పాటు అధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని సంస్థ డైరెక్టర్లు శేష సాయిబాబు, అన్నా నందకిషోర్ తెలిపారు. బ్రాడీపేట 2/9లోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీకాం జనరల్ విభాగంలో టి.ఒలీవ్ గ్లోరియానా 700 మార్కులకు 619, షేక్ సుమయా 612, జె.మౌని సృజన 599, రితిక కుమారి 584, వి.నరేష్‌కుమార్ 582 మార్కులు బీకాం కంప్యూటర్స్‌లో బి.షారోనికా 800 మార్కులకు 714, పి.అర్షియా 678, ఎ.మహేశ్వరి 659, ఎన్.స్తుతిహర్షిత 654, షేక్ క్యాబాహౌసైస్ 646 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు.